క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి గ్రామంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పోరంకి పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీంతో నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మీనగర్, వసంతనగర్, విష్ణుపురంకాలనీ, లక్ష్మీపురం, సాయి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

మోసం చేసిన ముగ్గురిపై కేసు

పెనమలూరు: కోర్టు పరిధిలో ఉన్న రెండు ప్లాట్స్‌ను మోసపూరితంగా మహిళకు విక్రయించిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు డొంక రోడ్డులో ఉంటున్న ఇంతూరి ఉమాదేవి 2022లో యనమలకుదురులోని బాలాజీ రెసిడెన్సీలో రెండు ప్లాట్‌లు దారపురెడ్డి బాలశ్రీనివాసరావు, ఇంటూరి సురేష్, శ్రీదేవిల వద్ద కొనుగోలు చేసింది. అయితే సురేష్, శ్రీదేవి గతంలో వల్లభనేని శేషగిరిరావుకు రూ. 15 లక్షలు సొమ్ము అప్పుగా ఉన్నారు. దీంతో శేషగిరిరావు ఈ ఆస్తులపై కోర్టులో కేసు వేసి అటాచ్‌మెంట్ తీసుకున్నాడు. ఈ విషయాన్ని కప్పిపుచ్చి దస్తావేజులను సృష్టించి ఉమాదేవి వద్ద రూ. 50 లక్షలు తీసుకొని దారపురెడ్డి బాలశ్రీనివాసరావు, ఇంటూరి సురేష్, శ్రీదేవి ఆస్తిని అమ్మారు. కోర్టు సదరు ఆస్తుల వేలం వేయటానికి రావటంతో జరిగిన మోసం ఉమాదేవికి తెలిసింది. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు ముగ్గురి పై కేసు నమోదు చేశారు.

చెరువు వద్ద హెచ్చరిక బోర్డులు

గన్నవరం రూరల్: మండలంలోని సావరగూడెం బాపట చెరువు వద్ద సోమవారం సీఐ పి.కనకారావు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. ఆదివారం ఈ చెరువులో మునిగి విజయవాడకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందటంతో ఎస్పీ జాషువా ఆదేశాలతో సీఐ, సిబ్బంది, సర్పంచ్ అట్ల నాగేశ్వరరావుతో కలసి చెరువు వద్ద ప్రమాదాన్ని సూచించే విధంగా బోర్డును ఏర్పాటు చేశారు. ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా ఈ సూచికలు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ చెరువు వద్ద ఫొటో షూట్‌లు, స్నానాలు చేయరాదని, చెరువు చాలా లోతుగా ఉందని చెప్పారు. ఈ ప్రాంతం ఊరికి దూరంగా నిర్మానుష్యంగా ఉందని, ఎవరు ఈ ప్రాంతం వైపు వెళ్లవద్దని సూచించారు.

ఆటోమొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం

గన్నవరం: స్థానిక శాంతి థియేటర్ సమీపంలోని ఆటోమొబైల్ దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ ఇచ్చిన సమాచారం మేరకు.. గన్నవరానికి చెందిన గురవారెడ్డి జాతీయ రహదారి పక్కనే ఉన్న శ్రీనివాస్ ఆటో మొబైల్ షాపు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో మూసి ఉన్న దుకాణం ఎదుట అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బీట్ కానిస్టేబుల్స్ సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని అతి కష్టం మీద మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 1 లక్ష వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీలు

గన్నవరం: స్థానిక కొత్తపేట వద్ద జాతీయ రహదారిపై రెండు లారీలు అదుపుతప్పి సెంట్రల్ డివైడర్‌పైకి దూసుకుపోయిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసుల సమాచారం ప్రకారం.. చెన్నై నుంచి టపాసుల లోడుతో కంటైనర్ లారీ ఏలూరు వైపు బయలుదేరింది. తెల్లవారుజామున స్థానిక కొత్తపేట వద్ద జాతీయ రహదారి దాటుతున్న టిప్పర్‌ను ఢీకొని కంటైనర్ లారీ అదుపుతప్పి సెంట్రల్ డివైడర్‌పైకి దూసుకుపోయింది. కొద్దిసేపటికే ఏలూరు వైపు వెళ్లే మరో లారీ ప్రమాదవశాత్తు అదే ప్రాంతంలో సెంట్రల్ డివైడర్‌పైకి ఎక్కేసింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కానప్పటికి జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన లారీలను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలతో మద్దతు ధర

కంకిపాడు: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర లభిస్తోందని మంతెన పీఏసీఎస్ చైర్మన్ పటాకుల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామం నుంచి 45 టన్నుల ధాన్యం సేకరించి సోమవారం మిల్లులకు తరలించారు. లారీలకు శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దళారులను ఆశ్రయించొద్దని హితవు పలికారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జగన్నాథపురం, మంతెన సర్పంచ్‌లు పిన్నబోయిన శ్రీనివాసరావు, వీరంకి వెంకట రమణ, వీఏఏ కోటేశ్వరి, సొసైటీ కార్యదర్శి శివనాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు

ఉయ్యూరు: జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు అని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. మునిసిపాలిటీలోని ఏడో సచివాలయ పరిధిలోని 13, 14వ వార్డులకు సంబంధించి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వార్డు సచివాలయాన్ని సందర్శించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై చర్చించి సంక్షేమ బోర్డు ఆవిష్కరించారు. కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబూకలాం, కౌన్సిలర్‌లు కూరాడ వెంకటలక్ష్మి, డాక్టర్ జంపాన పూర్ణిమ, పైలా శ్రీనివాసరావు, గుంజా సుధాకర్ బాబు, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, జేసీఎస్ చైర్మన్ వణుకూరు సురేష్ పాల్గొన్నారు. మండలంలోని కాటూరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి, సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి, ఎంపీటీసీ తోట శ్రీలక్ష్మి, కో ఆప్షన్ సభ్యురాలు బందెల జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ గొట్టం శ్రీనివాసరావు పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు.

జగన్నతోనే సంక్షేమం

పెనమలూరు: జగనన్న పాలనలోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని గోసాల సర్పంచి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు అన్నారు. గోసాల 1వ సచివాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 1వ సచివాలయంలో గత నాలుగున్నర సంవత్సరాలలో సంక్షేమ పథకాల కింద రూ. 25 కోట్లు సొమ్ము పేద ప్రజలకు ప్రభుత్వం అందించిందన్నారు. కార్యక్రమంలో నేతలు భువనగిరి రమణమూర్తి, షేక్.పీర్‌అహ్మద్, పోలవరపు రవి, ఆసీఫ్, ఎండీ.దాదా, షేక్.నాసర్, చాన్‌బాషా, సింగవరపు విజయ, ఈవో ప్రసాద్ పాల్గొన్నారు.

యనమలకుదురులో..

యనమలకుదురు సచివాలయం 2లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సచివాలయం పరిధిలో రూ. 67.85 కోట్లు సంక్షేమ పథకాల కింద పేదలకు సాయం అందించారు.



ఉయ్యూరులో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ నాని



పునాదిపాడు సచివాలయంలో సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు



గోసాలలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు



చిక్కవరంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి తదితరులు

ప్రభుత్వం పేదలకు చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. మేనేజర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉద్దంటి వినోద్ పాల్గొన్నారు.

జగన్‌తోనే సుస్థిర, సంక్షేమ పాలన

కంకిపాడు: సుస్థిర, సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని పునాదిపాడు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సంక్షేమ బోర్డును ఆవిష్కరించి, సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా బాకీ బాబు మాట్లాడుతూ అధికారం కోసం హామీలు ఇచ్చే నాయకుడు కాదని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ సంక్షేమానికి అర్థం చెప్పిన వ్యక్తి సీఎం జగనన్న అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిబోయిన విజయకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, సీహెచ్‌సీ చైర్మన్ మేదండ్రావు కుటుంబరావు, నాయకులు పాల్గొన్నారు.

నేడు తెన్నేరులో..

మండలంలోని తెన్నేరు గ్రామంలో ఈనెల 21న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు తెలిపారు.

పేదల జీవితాల్లో వెలుగులు..

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం గ్రామంలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు మరింతగా ప్రజలకు దగ్గర కావాలంటే ఆయననే మరలా మనమందరం సీఎంగా ఎన్నుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగనన్న పత్రాలను అందజేశారు. సర్పంచ్ అన్నే లక్ష్మణరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు మోరం నాగరాణి, స్థానిక సచివాలయం కన్వీనర్‌లు, బూత్ కన్వీనర్ పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సేవలో దేవదాయ శాఖ కమిషనర్



పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయాన్ని దేవదాయ, ధర్మదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సందర్శించారు. కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా కమిషనర్ ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు కమిషనర్ సత్యనారాయణను శేషవస్త్రంతో సత్కరించి దేవస్థానం ఫొటోను బహూకరించారు. కార్యక్రమంలో ఈవో ఎం.గంగాధరరావు, ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్ పాల్గొన్నారు.

కంకిపాడు ప్రధాన రహదారికి మరమ్మతులు

కంకిపాడు: ఎట్టకేలకు కంకిపాడు ప్రధాన రహదారి మరమ్మతులు జరుగుతున్నాయి. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి అభివృద్ధి, విస్తరణ చర్యల్లో భాగంగా నిధులు మంజూరయ్యాయి. ఓ వైపు కొణతనపాడు అడ్డరోడ్డు నుంచి ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వరకూ రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇదే క్రమంలో కంకిపాడు ప్రధాన పట్టణంలో రోడ్డు మరమ్మతులు చేపట్టాల్సి ఉండటంతో ఆ శాఖ అధికారులు రోడ్డు మరమ్మతులను చేపట్టారు. రోడ్డుపై మట్టి, వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించి మరమ్మతులను సమర్థంగా చేపడుతున్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

గన్నవరం: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ చట్టాలు పట్ల అవగాహన పెంచుకోవాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి. శిరీష సూచించారు. దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరిపీధి వెంకయ్య, ప్రధాన కార్యదర్శి జాస్తి తాతారావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పెనమలూరు: మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ జాకబ్‌రాజు అన్నారు. వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా సోమవారం సే నో టు డ్రగ్స్ అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యలు బాలలపై చాలా ప్రభావం చూపుతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

మంచి, చెడు ప్రవర్తనపై అవగాహన కల్పించాలి

కంకిపాడు: మంచి, చెడు ప్రవర్తనపై చిన్ననాటి నుంచి అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ కృష్ణాజిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సువర్ణ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఐసీడీఎస్ కంకిపాడు సీడీపీఓ కె.బేబిసుకన్య, హెచ్ఎం పద్మావతి, బాలల పరిరక్షణాధికారి వై.జాన్సన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శిరీష



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ

'పొలంబడి' పద్ధతులతో రైతులకు మేలు

పెనమలూరు: రైతులు పొలంబడిలో ఇచ్చిన సూచనలు పాటించి సాగు చేస్తే సాగు ఖర్చు తగ్గించవచ్చని ఏడీఏ ఎం.సునీల్ అన్నారు. గంగూరులో సోమవారం రైతులకు పొలంబడి క్షేత్ర దినోత్సవం నిర్వహించి ఏడీఏ వివరాలు వెల్లడించారు. గంగూరులో గతంలో వైఎస్సార్ పొలంబడి ద్వారా రైతులకు అవగాహన కల్పించామన్నారు. దీంతో రైతులు పురుగుల మందులు, ఎరువులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు వాడటం వల్ల ఎకరాకు రూ. 4,200 సొమ్ము ఆదా అయిందని ఏడీఏ తెలిపారు. గంగూరు గ్రామంలో మొత్తం 450 ఎకరాల్లో సాగు జరగగా పొలంబడి పద్ధతులు అవలంభించటం వల్ల మొత్తం రూ. 18 లక్షల ఖర్చు ఆదా అయిందని తెలిపారు.

అవగాహన సదస్సు..

గ్రామంలో రైతులకు ధాన్యం కొనుగోలుపై ఏడీఏ సునీల్ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తుందని ఏ గ్రేడ్ క్వింటాకు రూ. 2,203, కామన్ గ్రేడ్ క్వింటాకు రూ. 2,183 చొప్పున కనీస మద్దతు ధర చెల్లిస్తారన్నారు. మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సునీల్

మంచి వ్యక్తిత్వం అలవర్చుకోవాలి

పెనమలూరు: యువతలో వ్యక్తిత్వ వికాసం పెరగాలని శ్రీలంకకు చెందిన అక్షరాత్మానందస్వామి అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఎన్ఎస్ఎస్, రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో యువతలో వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ మనస్తత్వ దోరణి, విలువలు, నమ్మకాలతో మన ప్రవర్తన తెలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ వివేకానంద జీవిత చరిత్ర చదవాలని సూచించారు. స్వామీ అనుపమానంద, స్వామీ వినిస్చిలానంద, ఏవో సాయిబాబు, ఎన్ఎస్ఎస్ అధికారి కొల్లా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో కార్తిక శోభ

ఉయ్యూరు: కార్తిక మాసం తొలి సోమవారం శైవక్షేత్రాలు కార్తికశోభను సంతరించుకున్నాయి. భక్తులు తెల్లవారుజము నుంచే శివాలయాల్లో కార్తిక దీపాలను వెలిగించి పూజలు చేశారు. కార్తిక నోము ఆచరించి భక్తిపారవశ్యం చెందారు. ఉయ్యూరు, పెద ఓగిరాల శివాలయాలు భక్తులతో కిటకిటలాడింది.

పేరంటాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


రామవరప్పాడు : కార్తికమాసం మొదటి సోమవారం పురస్కరించుకొని విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ఆలయంలోని ఉప ఆలయమైన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే ఆలయంలో కార్తిక దీపాలను వెలగించారు.

యనమలకుదురులో ఆలయంలో..

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం కార్తిక పూజలు నిర్వహించారు. మొదటి కార్తిక సోమవారం కావటంతో భక్తులు ఉదయం 5 గంటలకే ఆలయానికి వచ్చారు. స్వామివారికి ఏకరుద్రాభిషేకం, విశేష అలంకరణ, శాంతికల్యాణం చేశారు. రాత్రి కార్తిక దీపాలు వెలిగించారు. అనంతరం పటమటకు చెందిన హవీష్‌చౌదరి కళాక్షేత్ర అకాడమీ చిన్నారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన అత్యంత వైభవంగా చేశారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ డైరెక్టర్ వీజీ రెడ్డి సతీమణి వీజీ బిందు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తిక పూజలు

విజయవాడరూరల్: కార్తిక మాసం మొదటి సోమవారం గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు తెల్లవారు జాము నుంచి శివపార్వతులకు రుద్రాభిషేకాలు, పూజలు నిర్వహించారు. నున్న గ్రామంలోని ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని అభిషేకం తిలకించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం నీరాజన మంత్రపుష్ప, తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవదాయశాఖకు చెందిన రామలింగేశ్వర స్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానాల్లో ఉదయం నుంచి మహిళా భక్తులు ప్రమిదలు వెలిగించి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.



యనమలకుదురు ఆలయంలో నృత్య ప్రదర్శన చేసిన బాలికలతో అతిథులు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఉయ్యూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం ఉయ్యూరు గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్ కూరాడ వెంకటలక్ష్మి, దళిత ఐక్య వేదిక వ్యవస్థాపకుడు పినమాల నాగకుమార్ విద్యార్థులకు బహుమతులు అందించారు. పెద ఓగిరాల గ్రంథాలయంలో ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కాటూరు, ముదునూరు గ్రంథాలయాల్లో వారోత్సవాలు ముగిశాయి.

జీవితాల్లో వెలుగులు..

గన్నవరం రూరల్: విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేవి గ్రంథాలయాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. సోమవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయం అధికారి కె.కృపానందం అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. వారం రోజులుగా పోటీల్లో పాల్గొని విజేతలుగా రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముస్తాబాద శాఖ గ్రంథాలయంలో జరిగిన ముగింపు సభలో పలువురు అతిథులు విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

గన్నవరం: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు రోటరీక్లబ్ అధ్యక్షులు జాస్తి విజయభూషణ్‌కుమార్ అవార్డులను అందజేశారు. గ్రంథాలయాలను విద్యార్థులకు చేరువ చేసేందుకు వారి సభ్యత్వ రుసుమును రోటరీక్లబ్ ద్వారా చెల్లించనున్నట్లు జాస్తి తెలిపారు. వారోత్సవాలను విజయవంతం చేసిన సిబ్బంది, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులను మెమెంటోలతో కమిటీ చైర్మన్ నర్రా సీతారామారావు సత్కరించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పాటు

ఉంగుటూరు: గ్రంథాలయాల సభ్యత్వాలు అందరు తీసుకుని గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పడాలని వైఎస్సార్ సీపీ కన్వీనర్, గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు గోగినేని వెంకటేశ్వరరావు(బాబు) అన్నారు. మండలంలో జిల్లా శాఖ గ్రంథాలయాల్లో జరుగుతున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. విజేతలకు వెంకటేశ్వరరావు చేతులు మీదుగా బహుతులు అందజేశారు.

గ్రంథాలయాలు సామాజిక కర్మాగారాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రంథాలయాలు భావి భారత పౌరులను తీర్చిదిద్దే సామాజిక కర్మాగారాలుగా ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని వీరవల్లి, కానుమోలు, బాపులపాడు శాఖ గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రజా ప్రతినిధుల చేతుల మీదగా బహుమతులు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను పంపిణీ చేశారు.



విజేతలైన విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న అతిథులు



పురుషోత్తపట్నంలో విజేతలకు బహుమతులు అందజేసిన జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, అతిథులు

గ్రంథాలయాలతో విజ్ఞానం



కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

కంకిపాడు: గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందుతుందని వక్తలు పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. తెన్నేరు శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కంకిపాడు శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. విద్యార్థు లు, ఉపాధ్యాయులు గ్రంథాలయాల విశిష్టతను తెలియజేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో జాస్తి, కమిటీ సభ్యులు



మానికొండలో బహుమతులు అందజేస్తున్న గోగినేని వెంకటేశ్వరరావు

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

పెనమలూరు: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, విద్యార్థులు ప్రతి రోజు గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేసుకోవాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం పెనమలూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వణుకూరులో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత చక్క గోపీకృష్ణ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



పెనమలూరులో ప్రసంగిస్తున్న తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య



వీరవల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

రామవరప్పాడు: గ్రామంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు తెలిపారు. నిడమానూరు రామానగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20లక్షలతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. రంగారావు మాట్లాడుతూ గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో రహదారి, డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే రెండు సచివాలయాల పరిధిలో పనులు కూడా పూర్తి అయ్యాయన్నారు. రామానగర్‌లో ప్రారంభించిన రహదారి నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ నాథ్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ వరి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో పలు అంశాలను పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. తొలుత పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు అజెండాలోని పలు అంశాలను పాలకవర్గ సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం జనన, మరణాలు రికార్డు చేయడం గురించి, రాజుల బజారుకు ఆర్చి ఏర్పాటు, పీఎస్ఆర్ కాలనీ, పటేల్‌నగర్, సాయి నగర్‌లలో జియో డిజిటల్ ఫైబర్ వారు 60 పోల్స్ వేసుకునేందుకు, మల్లెమూడి వారి వీధి చివర రోడ్డు, డ్రెయిన్ ఏర్పాటు చేసేందుకు పాలకవర్గ సమావేశంలో చర్చించి ఆమోదించారు. అలాగే గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద నున్న పంచాయతీ కామన్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని పలువురు వార్డు సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. వాటర్ ట్యాంక్ వద్ద సుమారు 43 సెంట్లు కామన్ స్థలం ఉండాలని కానీ అది క్రమేణా కుంచించుకుపోతుందని తెలిపారు. అలాగే సిండికేట్ బ్యాంక్ కాలనీలోని మెయిన్ రోడ్డుకు బల్లెం నాగేశ్వరరావు రోడ్డుగా నామకరణం చేసే అంశాన్ని పలువురు వార్డు సభ్యులు అభ్యంతరం తెలిపారు. సమావేశంలో వార్డు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

దేశం గర్వపడేలా విద్యార్థులు కృషి చేయాలి

పెనమలూరు: విద్యార్థులు దేశం గర్వపడేలా కృషి చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం రీజినల్ హెడ్ కె.వెంకట్రావు అన్నారు. బ్యాంకు 105 వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కానూరు, తాడిగడప సంయుక్తంగా 'స్ప్రెడ్ లవ్ గివ్ హోప్' అనే అంశంపై గుణదల కార్మేల్ నగర్‌లో సోమవారం విజయమేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ బ్లైండ్‌ను సందర్శించి విద్యార్థులకు అవసరాల కోసం కుర్చీలు అందజేశారు. విద్యార్థులు అభివృద్ధి సాధించాలని రీజినల్ హెడ్ వెంకట్రావు విద్యార్థులను ఉత్తేజపరిచారు. పిల్లలతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కానూరు, తాడిగడప బ్రాంచ్ మేనేజర్లు మనీష్‌కుమార్, కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.